# తెలంగాణపై చెరగని ముద్ర కేసీఆర్

## కాకతీయ తోరణం, చార్మినార్ నగర, గ్రామీణ జీవన ప్రతీకలు • రాచరిక చిహ్నాలు అన్నది ఒక తొంపు

- నెహ్రూని మించినవాడా రేవంత్?
- చేతకాని వాళ్లే పేర్లు మారుస్తరు
- రేవంత్ నేటికీ జై తెలంగాణ అనలే
- తెలంగాణ ఉద్యమంలో రేవంత్ రానందుకు దేవుడికి దండం పెట్టాలి
- అందెశ్రీవి ఉద్యమ మాటలు కావు
- కేసీఆర్ ఆనవాళ్లు చెరపడం అసాధ్యం
- కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్

*తెలంగాణ కోసం సకల జనులు పోరాడుతున్నప్పుడు తెలుగు తల్లి వద్దని తెలంగాణ తల్లిని ప్రజలు ఆవిష్కరించుకున్నారు. ఇప్పుడు మళ్లీ విగ్రహాల ముచ్చట వినిపిస్తున్నది. ఒక్క విగ్రహమే కాదు రాష్ట్ర చిహ్నం మార్చాలనే ప్రయత్నమూ జరుగుతున్నది. రాష్ట్ర గీతం ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసిందని సోషల్ మీడియాలో చర్చ సాగుతున్నది. తెలంగాణకు జై కొట్టనోడికి, తెలంగాణ కోసం పోరాడనోడికి తెలంగాణ తల్లి గురించి మాట్లాడే అర్హతే లేదంటున్నారు తెలంగాణ ఉద్యమ కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల నుంచి తెలంగాణ తల్లి ఎలా పుట్టిందో.. రాష్ట్ర చిహ్నం ఎట్లా రూపుదిద్దుకున్నదో ఉద్యమ ముచ్చట్లను నమస్తే తెలంగాణ పాఠకులతో యాది జేసుకుంటున్నారాయన.* -నమస్తే తెలంగాణ, హైదరాబాద్

**నమస్తే తెలంగాణ: తెలంగాణ చిహ్నంలో కాకతీయ తోరణం ఎలా ప్రవేశించింది?**

దేశపతి శ్రీనివాస్: సమైక్యాంధ్ర పాలనలో తెలంగాణ సంస్కృతి వివక్షకు గురైంది. ఆ విషయాలు తెలంగాణ ఉద్యమం మాట్లాడింది. ఆ పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలు కాకతీయుల వైభవాన్ని ప్రతి వేదికపైనా చాటుకున్నారు. ఉద్యమ కాలంలోనే సోషల్ మీడియాలో తెలంగాణ రాష్ట్ర చిహ్నం ఇలా ఉంటే బాగుంటుందని కొంతమంది ప్రతిపాదించారు. తెలంగాణ చిహ్నం ఎవరికి వారుగా రూపొందించుకున్నారు. ఉద్యమ కాలంలో ఒక చిహ్నం ప్రాచుర్యంలోకి వచ్చింది. దానికి మరొక చిహ్నం చేర్చే బాధ్యతను ఏలే లక్ష్మణ్‌కి అప్పగించి, చార్మినార్‌ని చేర్చాలని కేసీఆర్ సూచించాడు. కాకతీయ తోరణం, చార్మినార్.. నగర, గ్రామీణ జీవితాలకు ప్రతీకలు. కాకతీయ శిల్పాలను యునెస్కో గుర్తించింది. కానీ, రేవంత్ రెడ్డి గుర్తించట్లేదు.

**రాచరిక చిహ్నాలు తీసేస్తే తప్పేంటి?**

కాకతీయ కళా తోరణం కాకతీయుల కాలం నాటి శిల్పుల ప్రతిభకు ప్రతీక. రాచరిక చిహ్నాలు అన్నది ఒక తొంపు (సాకు) మాత్రమే. కేసీఆర్ ఆనవాళ్లను మలిపేయాలన్నదే ఆయన లక్ష్యం. కేసీఆర్ ఏది పెట్టిండో అది తీసేపని మొదలుపెట్టిండు. కాకతీయ తోరణం మీద వెతుక్కొని తెచ్చుకున్న తొంపు ప్రజల ముందు చెల్లదు. తెలంగాణ చిహ్నం విడుదలైనప్పుడు ఈ మాట ఎవరూ అనలేదు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ఒక్కడే అంటున్నాడు. అశోకుడిని ఒకలా, కాకతీయుల్ని మరోలా ఎందుకు చూడాలి? రాష్ట్ర చిహ్నంలో ఏదైనా చేర్చితే మంచిదే. కానీ, చెరపాలనుకోవడం తప్పు. రాచరిక చిహ్నాలు ఉండొద్దంటే చర్చ భారతదేశ అధికార చిహ్నం నుంచి మొదలుపెట్టాలి. భారతదేశ రాజముద్రలోని నాలుగు సింహాలు, జాతీయజెండాలో ధర్మచక్రం సారనాథ్ స్థూపం నుంచి తీసుకున్నవి. దాని నిర్మాత అశోకుడు. ఆయన రాజే. ఆ చిహ్నాలను నెహ్రూ ఎంపిక చేశాడు. రేవంత్‌రెడ్డి ఆ నెహ్రూని మించిన మేధావి అయ్యాడా?



**జయజయహే గీతానికి సంగీతం అందించేంతటి కళాకారులు తెలంగాణలో లేరా?**

రాష్ట్ర గీతాన్ని రాష్ట్ర కళాకారులతో రూపొందించడమే ఔచిత్యం. తెలంగాణ కళాకారులకు అవకాశం ఇవ్వకపోగా గీత రచయిత తెలంగాణ కళాకారులను తక్కువ చేసి మాట్లాడటం ఆక్షేపణీయం. తెలంగాణ ఉద్యమంలో పాటలు ఉత్ప్రేరకంగా పనిచేశాయి. తెలంగాణ రాష్ట్రం సాకారం కావడంలో అనేకమంది కవిగాయకుల పాత్ర ఉంది. జయ జయహే పాటకు బాణీ ఉన్నది. దానికి వాద్య కల్పన చేయడానికి అర్హమైన కళాకారులు, తెలంగాణలో సంగీత దర్శకులు ఎందరో ఉన్నారు. లేరన్నది నిజం కాదు. అందెశ్రీ వంటి ఉద్యమ కవి అనకూడని మాటలవి.

**చిహ్నంలో చార్మినార్ ఎంపికకు కారణం?**

ప్లేగువ్యాధితో మరణించిన ప్రజల స్మారకంగా కుతుబ్‌షాహీలు చార్మినార్ నిర్మించారు. ఆకాశంవైపు చేతులెత్తి అల్లాను దువా అడుగుతున్నట్టుగా చార్మినార్ కనిపిస్తుంది. సముద్రాన్ని చేపలతో నింపినట్లుగా ఈ నగరాన్ని ప్రజలతో నింపమని ఇబ్రహీం కులీ కుతుబ్‌షా అల్లాను ప్రార్థిస్తూ హైదరాబాద్ నగర నిర్మాణం చేపట్టాడు. తర్వాత కాలంలో అదే జరిగింది. రాష్ట్ర చిహ్నంలోని కాకతీయుల కళా తోరణం, చార్మినార్ తెలంగాణ గంగా జమునా సహజీవనానికి సంకేతాలు. గ్రామీణ, పట్టణ జీవనానికి ఈ రెండూ ప్రతీకలు.

**కాకతీయ తోరణం ఎంపిక ఔచిత్యమేంటి?**

కాకతీయ తోరణంపైన ఉన్న హంసలు పాదర్శక పాలనకు సంకేతం. సింహాలు పరాక్రమానికి, పూర్ణ కుంభాలు సౌభాగ్య చిహ్నం. స్తంభాలపై కిందివైపున మొసళ్లు ఉన్నాయి. కాకతీయులు చెరువులు తవ్వించారు. మొసళ్లు జలసంపదకు గుర్తు. తోరణంపైన చేప మత్స్య సంపదకు చిహ్నం. మన కళ, సంస్కృతి, చరిత్ర, భౌగోళికతను ఈ తోరణం ప్రతిబింబిస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చెరువులను బాగు చేయించింది. మత్స్య సందను పెంచింది. ఇవన్నీ కాకతీయుల నాటి కృషికి కొనసాగింపు. అందుకే కాకతీయ తోరణం ఎంపికకు ఔచిత్యం ఉన్నది.

### రేవంత్‌రెడ్డి బలం, బలగం ఎవరై ఉంటారు?

చంద్రబాబుని అనుసరించిన ఇండస్ట్రియల్ లాబీ, పెట్టుబడిదారుల కూటమి అండదండలు రేవంత్‌రెడ్డికి పుష్కలంగా ఉన్నాయి. అవే నిన్నటి ఎన్నికల్లో రేవంత్‌కి పెట్టుబడులు సమకూర్చాయి. రేవంత్‌రెడ్డి విజయోత్సవంలో తెలుగుదేశం జెండాలు అగ్రభాగాన ఉన్నాయి. ఆయన దావోస్ పర్యటనకు పోతే తెలుగుదేశం పార్టీ జెండాలు స్వాగతం పలికాయి. పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మంలో తెలుగుదేశం పార్టీ ఆఫీసుకు పోయి 'మా కాంగ్రెస్ వాళ్ల కంటే మీరే గెలుపు కోసం ఎక్కువగా కష్టపడ్డారు' అని ప్రశంసించాడు. చంద్రబాబునాయుడిని అభిమానించేవాళ్లు రేవంత్‌రెడ్డి సీఎం కావాలని కోరుకున్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ అవశేషాలు కాంగ్రెస్‌ను అంటిపెట్టుకుని బతుకుతున్నాయి. రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలోకి రానందుకు దేవుడికి దండం పెట్టాలి. ఆయన వచ్చి ఉంటే తెలంగాణ రాష్ట్రం రాకపోయేది.

**పేర్లు, చిహ్నాల గురించి ఇటీవల చర్చ ఎక్కువగా జరుగుతున్నది. ఎందుకు?**

పాలన, అభివృద్ధి చేతకాక. అభివృద్ధి చేయడం చేతగానివాళ్లే పేర్లు మార్చేస్తారంటూ బీజేపీని ఉద్దేశించి రాహుల్ గాంధీ గతంలోనే చెప్పాడు. ఆ మాటలు రేవంత్‌కూ వర్తిస్తాయి. ఢిల్లీలో అక్బర్, షాజహాన్, ఔరంగజేబు పేర్లతో వీధులున్నాయి. ఈ పేర్లు మార్చాలని బీజేపీ అన్నప్పుడు మొఘలులు ఇక్కడి వాళ్లేనని, వలస పాలకులు కాదన్నారు. మొఘలులను స్వీకరించే విశాలత్వం ఉన్న కాంగ్రెస్ పార్టీలో కాకతీయులను తిరస్కరించే సంకుచితత్వం ఉన్న రేవంత్‌రెడ్డి కూడా ఉన్నాడు.

**తెలంగాణపై మాట్లాడే నైతికత రేవంత్‌కు లేదని బీఆర్‌ఎస్ అంటున్నది ఎందుకు?**

రేవంత్‌కి తెలంగాణ ఉద్యమ భాగస్వామ్యం లేదు. తెలంగాణలో చంద్రబాబు పాదయాత్ర చేస్తుంటే.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పట్ల తన వైఖరి చెప్పాలని జేఏసీ అడగడానికి పోతామన్నది. అప్పుడు.. 'ఎవడ్రా మమ్మల్ని అడిగేవాడు? అడ్డొచ్చేవాడు. అడిగిన వాడిని కాల్చేస్తా'నని రైఫిల్ తీసుకుని బయలుదేరిన వాడు రేవంత్‌రెడ్డి. తెలంగాణ మీద స్పష్టమైన వైఖరి చెప్పమన్నందుకు చంద్రబాబునాయుడు న్యాయవాదుల తలలు పగులగొట్టించాడు. తెలంగాణకు అనుకూలంగా నటిస్తూ, రాష్ట్ర ఆవిర్భావాన్ని ఆపాలని చంద్రబాబుతో కలిసి మాయోపాయాలు పన్నాడు. రేవంత్‌రెడ్డి ఈరోజు వరకు జై తెలంగాణ అనలేదు. జై తెలంగాణ నినాదం బీఆర్‌ఎస్ పార్టీ, కేసీఆర్ నినాదం అనుకుంటున్నాడు. అది ఆయన అవగాహనా రాహిత్యం.. 'జై తెలంగాణ' అనడం పుట్టిన గడ్డకు జైకొట్టడం. ఈ నినాదం 1969లోనూ ప్రతిధ్వనించింది.

**కేసీఆర్‌ని మరచిపోయేలా చేయాలన్నదే సీఎం లక్ష్యమా?**

అది సాధ్య కాని పని. తెలంగాణ సాధన ఉద్యమంలో కేసీఆర్ కృషి ప్రథమ గణ్యం. జయశంకర్ సార్, బియ్యాల జనార్దన్‌రావు, గద్దర్, మారోజు వీరన్న, గాదె ఇన్నయ్య వంటి నాయకుల కృషితో తెలంగాణ రాష్ట్రం కోసం తొలి ప్రయత్నాలు కొంత ముందడుగు వేశాయి. బెల్లి లలిత హత్య తర్వాత మూగబోయిన తెలంగాణ ఆకాంక్షకు కేసీఆర్ జై కొట్టడం వల్లే తెలంగాణ నినాదం రాజకీయ శక్తిగా అవతరించింది. తెలంగాణ నినాదం ఎన్నికలనే ప్రభావితం చేసే స్థాయికి చేరింది. జనం బహిష్కరిస్తారేమోనని విధిలేక మిగతా పార్టీల నేతలు తెలంగాణకు జై కొట్టారు. తెలంగాణ వాణిని పార్లమెంట్ దాకా తీసుకుపోయింది కేసీఆరే. దేశవ్యాప్తంగా తిరిగి పార్టీల మద్దతు కూడగట్టింది కేసీఆరే. ఆమరణ నిరాహార దీక్షకు పూనుకొన్నాడు. ఒక అంకుశమై కాంగ్రెస్ నేతల్ని నిరంతరం పొడిచాడు. వీటి ఫలితమే తెలంగాణ రాష్ట్రం. తెలంగాణ సాధన కోసం కొండంత కృషి, సముద్రమంత దోహదం కేసీఆర్‌ది! కేసీఆర్ ఆనవాళ్లు చెరపాలనుకునే రేవంత్ రైతుబంధు ఆపేస్తానని అనగలడా?

– ఇంటర్వ్యూ: నాగవర్ధన్ రాయల

**తెలంగాణ తల్లి కొత్త విగ్రహాన్ని ప్రజలు ఆమోదిస్తారా?**

తెలంగాణ రాష్ట్ర ఉద్యమకాలంలో ఉద్యమ కార్యాచరణ, సాంస్కృతిక కార్యాచరణ వేర్వేరుగా లేవు. ఉద్యమం, సాంస్కృతిక ఉత్సవం ఏక కాలంలో కలగలిసి సాగాయి. బతుకమ్మ పోరాట రూపమైంది. గ్రామాల్లో, పట్టణాల్లోనే జరిగే బతుకమ్మ పండుగను నగరాల్లో ఘనంగా జరుపుకొన్నారు. షికాగో, న్యూయార్క్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌కు విస్తరించింది. ఉద్యమంలోకి బోనాల ప్రదర్శన వచ్చింది. వంటావార్పు కార్యక్రమంలో హైదరాబాద్‌లో రోడ్డు మీద తెలంగాణ తల్లి కూర్చుని వంట చేస్తున్నట్టు పోస్టర్ రూపొందించాం. తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వాన్ని చాటుకోవాలనే తాపత్రయం నుంచి జరిగిన ప్రయత్నం అది. తెలంగాణ తల్లి విగ్రహం తెలంగాణ ఉద్యమ రూపమని గుర్తించాలి. రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహం ఫలానాలా ఉన్నదని అంటున్నాడు. భారతీయ సంస్కృతిలో దేవతలందరూ కిరీటాలు కలిగి ఉన్నారు. సరస్వతీ, లక్ష్మీ దేవిలాగా కిరీటం, నగలతో దైవ స్వరూపంలాగా ఉంది. ఇంతకు ముందు తెలుగుతల్లికి కూడా కిరీటం ఉన్నది. తెలంగాణతల్లి అనే భావన, రూపం ఉద్యమ నేపథ్యం నుంచి వచ్చాయి. తెలంగాణ తల్లి మొదటి విగ్రహ ఆవిష్కరణ సభలో జయశంకర్ సార్, కోదండరామ్ ఉన్నారు. ఇప్పుడున్న రూపంలోనే ఊరూరా తెలంగాణ తల్లి విగ్రహాల ఆవిష్కరణలు జరిగాయి. తెలంగాణ తల్లి విగ్రహానికి ప్రజామోదం ఉన్నది. అప్పుడు తెలంగాణ తల్లి, తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఉన్నాయి. ఇప్పుడు తెలంగాణ తల్లి, తెలంగాణ రాష్ట్రం ఉన్నాయి. చేతిలో అధికారం ఉన్నదని కొత్తగా మరో విగ్రహం ప్రతిష్ఠిస్తే అది ప్రభుత్వం చేసిన ప్రతిష్ఠ అవుతుంది. కానీ, ప్రజలు ప్రతిష్ఠించుకున్నట్టు కాదు. తెలంగాణ ఉద్యమంలో లేని రేవంత్‌రెడ్డికి తెలంగాణ తల్లి గురించి మాట్లాడే ఆ నైతిక అర్హత లేదు.



### అందెశ్రీ మాట తప్పిండు

- కవి, సంగీత దర్శకుడు మల్లిక్ తేజ ఆవేదన

జగిత్యాల టౌన్, మే 30: జయ జయహే తెలంగాణ గేయానికి సంగీతం అందించే బాధ్యతను తనకు అప్పగిస్తానని తొలుత హామీఇచ్చిన కవి అందెశ్రీ ఇప్పుడు మాట తప్పారని కవి, సంగీత దర్శకుడు మల్లిక్ తేజ వాపోయారు. ఎన్నికల ముందు ఏడాది క్రితం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క పాదయాత్ర సమయంలో హడావుడి చేసి ఒక్క రోజులోనే 'జయ జయహే తెలంగాణ' పాటకు రూపకల్పన చేయాలని కొరియోగ్రాఫర్ అంతడుపుల నాగరాజన్నను కోరారని, ఆయన ఈ పాటను తనకు అప్పగించారని గుర్తు చేశారు. దాన్ని చాలెంజ్‌గా తీసుకొని క్రిటికల్ సమయంలో డబ్బులు ఆశించకుండా ఒక్క రోజులోనే పని పూర్తి చేశానని చెప్పారు. భవిష్యత్తులో ఈ పాటను ఉన్నత ప్రమాణాలతో రూపొందించే అవకాశాన్ని 'నీకే కల్పిస్తాం' అని మాట కూడా ఇచ్చారని పేర్కొన్నారు. కవి అందెశ్రీ కూడా ఈ పాట విని అద్భుతంగా చేశావని ప్రశంసించారని గుర్తుచేశారు. ఈ పాటను మళ్లీ అద్భుతంగా చేద్దామని చాలాసార్లు తనతో అన్నారని తెలిపారు. ఇప్పుడు తర్వాత తమలాంటి వాళ్లకు అవకాశమిస్తే మరింత ప్రేమతో పనిచేసే వాళ్లమని చెప్పారు. ఇప్పుడు మాట తప్పడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని మల్లిక్ తేజ చెప్పారు.

### 1న మిట్టపల్లి సరికొత్త రాష్ట్ర గేయం

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): మరో సరికొత్త రాష్ట్ర గేయం ప్రజలకు అందుబాటులోకి రానుంది. తెలంగాణ కవి, మిట్టపల్లి సురేందర్ కలం నుంచి జాలువారిన గేయం జూన్ 1న యూట్యూబ్ వేదికగా విడుదల కానుంది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలు ప్రతిబింబించే విధంగా సరికొత్త గేయం ఉంటుందని, తెలంగాణ గాయకులే పాడారని సురేందర్ తెలిపారు.



*అభివాదం చేస్తున్న జర్నలిస్ట్ పాశం యాదగిరి, జస్టిస్ చంద్రకుమార్ తదితరులు*

### 'ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలి'

చిక్కడపల్లి, మే 30 : కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టుగా రాష్ట్రంలో ఆరు గ్యారెంటీ స్కీంలను సమగ్రంగా అమలు చేయాలని, అమరుల కుటుంబాలకు 250 గజాల చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలని పలువురు తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్, 1969 ఉద్యమకారుడు సిద్ధులు, అన్వర్‌పటేల్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఉద్యమకారులను గుర్తిస్తామని చెప్పిన కాంగ్రెస్‌కు సహకరించారని తెలిపారు. ఉద్యమకారుల ప్రభుత్వమే ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులను గుర్తించడానికి పాశం యాదగిరి, గాదె ఇన్నయ్య తదితరులతో కమిటీ వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు గోధుమల కుమారస్వామి, దోనేటి కృష్ణలత, సూర్యం, సోగర బేగం, గొల్లపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


## అవి వారసత్వానికి ప్రతీకలు

- కాకతీయ కళాతోరణం, చార్మినార్ రాచరికపోకడలుగా చూడకూడదు
- రాచరికం అంటూ వ్యతిరేకిస్తూపోతే ఏ దేశానికి కూడా చరిత్ర మిగలదు
- రాజముద్ర చిత్రకారుడు లక్ష్మణ్ ఏలె



హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వ అధికారిక చిహ్నంలోని కాకతీయ కళాతోరణం, చార్మినార్ చిత్రాలను రాచరికపోకడలుగా చూడాల్సిన పనిలేదని, అవి తెలంగాణ ప్రజల సాంస్కృతిక, రాజకీయ వారసత్వానికి ప్రతీకలని ప్రస్తుత తెలంగాణ రాజముద్ర చిత్రకారుడు లక్ష్మణ్ ఏలె చెప్పారు. రాచరికం అంటూ వ్యతిరేకిస్తూపోతే ఏ దేశానికీ చరిత్ర మిగలదని, అలా వాటిని ఒకే కోణంలో చూడలేమని స్పష్టంచేశారు. రాజముద్ర మార్పుపై గురువారం ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'సాహసం, సాహిత్యం, కళలు, ముఖ్యంగా అజరామరమైన శిల్పకళకు నీరాజనం పట్టిన కాకతీయుల పాలనను మనం ఉద్యమకాలంలో గౌరవించుకున్నాం. చార్మినార్‌ను సమైక్య ప్రతీకగా నిలబెట్టుకున్నాం. వాటిని వదులుకోవడమంటే మన సంస్కృతిని కొంత వదులుకోవడమే. తెలంగాణ అధికార ముద్ర నుంచి వాటిని తొలగించాల్సిన పని లేదు. వాటిని అలా ఉండనిచ్చి, తెలంగాణ ఉద్యమాలకు గుర్తుగా అమరవీరుల ప్రతీకను కూడా కలిపితే మంచిదే.' అని లక్ష్మణ్ ఏలె పేర్కొన్నారు. 'ఇప్పుడున్న రాజముద్రను డిజైన్ చేసిన వ్యక్తిగా నాకు ఆ చిహ్నంతో భావోద్వేగమైన బంధం ఉన్నది. కానీ, నేనీ మాటలు వ్యక్తిగత భావోద్వేగంతో చెప్పడం లేదు. నాకు ఏ రాజకీయ పార్టీతో కూడా ప్రమేయం లేదు. నాకు తెలంగాణ చారిత్రక సాంస్కృతిక అస్థిత్వం ప్రధానం. తెలంగాణ ఉద్యమంతో పేగు సంబంధం ఉన్న చిత్రకారుడిగా నాకు తెలంగాణ అస్థిత్వ ప్రజా చైతన్య వారసత్వ నేపథ్యం ఉన్నది. అందుకే ఈ రాజముద్రని చిత్రించేటప్పుడు తెలంగాణ ప్రతీకలుగా వాటిని సకల జనామోదంగా తీసుకొని తీర్చిదిద్దాం' అని తెలిపారు. కొత్త చైతన్యం కోసం మార్పు కోరడం మంచిదేనని, అదే సమయంలో పాత సంస్కృతిని, పునాదులను మరిచిపోకూడదని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతానికి అధికార ముద్ర మార్పును వాయిదా వేయడం మంచి నిర్ణయమని, తుది నిర్ణయం తీసుకునేటప్పుడు కూడా ఈ అంశాలు దృష్టిలో ఉంచుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

- నిజాంకాలంలోనే 'కాకతీయ' రెవెన్యూ స్టాంపులు




*నిజాంకాలంలో కాకతీయుల కళాతోరణంతో కూడిన రెవెన్యూ స్టాంపులు ఇవి. 1937–45లో మీర్ ఉస్మాన్‌ఖాన్ ఈ స్టాంపులను తయారు చేశారు. రామప్ప ఆలయంలోని స్తంభాలనూ నోటుపై ముద్రించారు.*

### కళాతోరణం, చార్మినార్‌ను తొలగించొద్దు

- తెలంగాణ ఉద్యమకారుడు పినపాక



హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర రాజముద్ర నుంచి కాకతీయుల కళాతోరణం, చార్మినార్ గుర్తులను తీసివేయాలనే ప్రభుత్వ నిర్ణయం సరికాదని ఉద్యమకారుడు, కార్మిక నేత పినపాక ప్రభాకర్ పేర్కొన్నారు. కాకతీయులు నిర్మించిన గొలుసుకట్టు చెరువులు, చారిత్రక కట్టడాలు, దేవాలయాల ఘన చరిత్ర, పాలనా వైభవాన్ని చూడాలే కానీ ప్రభుత్వం రాచరికమని పేర్కొనడం సరికాదని సూచించారు. హైదరాబాద్ అంటేనే చార్మినార్ గుర్తుకొస్తుందని, చార్‌సౌసాల్ షహర్ అని ప్రచారం చేసుకున్న కాంగ్రెస్‌కి ఇప్పుడేం వచ్చిందని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాలు ఎప్పుడూ ప్రజామోదయోగ్యంగా ఉండాలని కోరారు.



### చిహ్నాల్లో మార్పులు తెలివి తక్కువతనమే

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన నాడు మేధావులతో చర్చించి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తెలంగాణ మట్టి బిడ్డ ఏలె లక్ష్మణ్‌తో పలు రకాల తెలంగాణ రాష్ట్ర చిహ్నాలను గీయించారు. అందులో అత్యుత్తమంగా పేర్కొనదగిన దాన్ని అందరి చేత ఆమోదం పొందిన అనంతరం అప్పటి సీఎం కేసీఆర్ ప్రభుత్వ రాజముద్రగా ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వం మిడిమిడిజ్ఞానంతో కాకతీయ తోరణం, చార్మినార్‌ను తొలగించడం తెలివితక్కువ తనానికి నిదర్శనం. తెలంగాణ ప్రతి మట్టి రేణువులోనూ శబ్దం, ధ్వని ఉంటుంది. పండితుల నుంచి పాలపిట్ట వరకు అందరిలోనూ సంగీతం ఇమిడి ఉంటుంది. అటువంటి బాణీల సొగసుకు అందాన్ని అద్దగలిగిన సంగీత దర్శకులు ఎందరో ఈ గడ్డ మీద ఉన్నా వాళ్లందరినీ పక్కనపెట్టి.. జై తెలంగాణ అనమంటే నై తెలంగాణ అన్న వాళ్లకు బాధ్యత అప్పజెప్పడం ఆత్మాభిమానాన్ని నిలువునా హత్య చేసినంతటి ఘాతకం. ఇటువంటి చేష్టలను ఎవరూ హర్షించరు.

– బండారు శంకర్, కవి, రచయిత, నల్లగొండ



*హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో జరిగిన మేధావుల సదస్సులో ప్రసంగిస్తున్న కేయూ ప్రొఫెసర్ విజయబాబు. చిత్రంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్*

## లోగో మార్పు పిచ్చి ఆలోచన

- కాకతీయ తోరణం, చార్మినార్ తొలగిస్తామంటే మరో ఉద్యమం
- బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా
- అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ చౌరస్తా, మే 30: చరిత్రపై అవగాహన లేని సీఎం రేవంత్‌రెడ్డి.. రాష్ట్ర రాజముద్రను మార్చే పిచ్చి ఆలోచన మానుకోవాలని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ హితవుపలికారు. జనామోదంతో కేసీఆర్ ఏర్పాటు చేసిన కాకతీయ తోరణం, చార్మినార్ లోగోను రాజముద్ర నుంచి తొలగిస్తామంటే మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. గురువారం హనుమకొండ కాకతీయ హరిత హోటల్‌లో టార్చ్ (టీం ఆఫ్ రిసెర్చ్ కల్చర్ అండ్ హెరిటేజ్) ఆధ్వర్యంలో నిర్వహించిన మేధావుల సదస్సులో ఆయన మాట్లాడారు. సంస్కృతికి చిహ్నం కాకతీయుల కళాతోరణమని, రాజముద్రలో తోరణాలను తొలిస్తే అందరూ ముక్తకంఠంతో ఖండించాలని కేయూ హిస్టరీ ప్రొఫెసర్ విజయబాబు పిలుపునిచ్చారు. సదస్సులో ప్రేరణి అశోక్, అభిషేక్, అస్నాల శ్రీనివాస్, పుల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### 'వారసత్వ చిహ్నాలను ఎలా తొలగిస్తారు?'



మేడ్చల్ కలెక్టరేట్, మే 30: సాంస్కృతిక వారసత్వ సంపదకు కాకతీయ కళాతోరణం, చార్మినార్ చిహ్నాలని, వాటిని ఎలా తొలగిస్తారని బీఆర్‌ఎస్ నేత బండెల పరమేశ్ ప్రశ్నించారు. అమరవీరుల స్థూపానికి సంబంధించి తమకు ఎలాంటి అభ్యంతరాలూ లేవని పేర్కొన్నారు. తెలంగాణ రాజముద్రలో మార్పులు తీసుకురావడాన్ని గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. కేసీఆర్ చేసిన అభివృద్ధిని తుడిచివేయాలని కాంగ్రెస్ కుట్ర పూరితంగా కాకతీయ కళాతోరణం, చార్మినార్ చిత్రాలను రాజముద్ర నుంచి తొలగించడం సబబుకాదని సూచించారు.

### ప్రజల మనోభావాలు దెబ్బతింటాయి

సాహితీవేత్త పడాల రఘురాం



మేడ్చల్, మే 30: రాష్ట్ర రాజముద్రలోని కాకతీయ కళాతోరణం, చార్మినార్ చిత్రాలను తొలగిస్తే తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతింటాయని సాహితీవేత్త పడాల రఘురాం పేర్కొన్నారు. ఆనాటి అద్భుత శిల్పాకళా శైలికి అద్దంపట్టే తోరణాన్ని తొలగించడం సరికాదని సూచించారు. ఇలాంటి చర్యలతో ప్రజల మనోభావాలు దెబ్బతింటాయన్న విషయాన్ని గుర్తించాలని సూచించారు.

### రాష్ట్ర చిహ్నం మార్పు క్రూరమైన ఆలోచన

బీఆర్‌ఎస్ నగర సంయుక్త కార్యదర్శి రాజేశ్ గౌడ్

అడ్డగుట్ట, మే 30: కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రను చెరిపివేసే కుట్ర చేస్తున్నదని బీఆర్‌ఎస్ నగర సంయుక్త కార్యదర్శి గుండవేణి రాజేశ్‌గౌడ్(పెద్దన్న) గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. తెలంగాణ అస్థిత్వాలైన కాకతీయుల తోరణం, చార్మినార్ గుర్తులను తొలగించడమంటే తెలంగాణ ఆత్మపై దెబ్బ కొట్టడమేనని పేర్కొన్నారు.



*కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్*

## అందెశ్రీ స్వరాష్ట్ర స్వాభిమానం ఏమైంది?

ఇప్పుడు ఆంధ్రావాళ్లు అక్కరకొచ్చారా? • మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్ కార్పొరేషన్, మే 30: జయ జయహే తెలంగాణ గేయ రచయిత అందెశ్రీ స్వరాష్ట్ర స్వాభిమానం ఇప్పుడు ఏమైందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నిలదీశారు. తన గేయానికి సంగీతం అందించడానికి ఇప్పుడు ఆంధ్రావాళ్లు అక్కరకు వచ్చారా? అని ప్రశ్నించారు. రాష్ట్ర గేయానికి బాణీలు తెలంగాణవారితోనే అందించాలని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారులు, మేధావులు, అమరవీరుల పాత్ర మరవలేనిదని పేర్కొన్నారు. అందుకే నాటి సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభలో అందెశ్రీని ఘనంగా సన్మానించి, తెలంగాణ జాతికి గొప్ప గేయాన్ని అందించావని ప్రశంసించారని గుర్తు చేశారు. అనంతరం జరిగిన చర్చలో విద్యార్థులతోపాటు సబ్బండవర్ణాలు గుర్తుంచుకునేలా గీతాలాపన ఉండేలా ఆలోచన చేద్దామని చెప్తే అక్కడి నుంచి హుటాహుటిన వెళ్లిపోయింది అందెశ్రీ అని గుర్తుచేశారు. అనంతరం గత గేయంలో ఏ మాత్రం తగ్గించేది లేదని మీడియా ముందుకు వచ్చి మాట్లాడింది అందెశ్రీనే అని పేర్కొన్నారు. మరి ఇప్పుడు రేవంత్‌రెడ్డితో కలిసి సమయాన్ని కుదిస్తూ, ముఖ్యంగా ఆంధ్రా సంగీత దర్శకుడు కీరవాణితో కలిసి గేయాన్ని ఎలా నిర్మాణం చేశారని ప్రశ్నించారు. తెలంగాణ వాళ్లని తొక్కాలని చూస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో కీరవాణిని మించిన సంగీత దర్శకుడు ఎవరని ప్రశ్నిస్తూ ఆయన ఎవరిని అగౌరవపరుస్తున్నారని నిలదీశారు. ఖమ్మం బిడ్డ వందేమాతం శ్రీనివాస్‌కు తొమ్మిది నంది అవార్డులు వచ్చిన విషయం గుర్తులేదా? అని ప్రశ్నించారు. చంద్రబోస్ వంటి ఎందరో కవులు, సంగీత మహనీయులు ఉన్నారని పేర్కొన్నారు. 'జై తెలంగాణ' అని ఏ రోజు కూడా అనని సీఎం రేవంత్‌రెడ్డితో రాష్ట్ర గేయాన్ని రూపకల్పన ఎలా చేశారని ప్రశ్నించారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్, నాయకులు అనిల్, ఓంకార్, ప్రభాకర్ పాల్గొన్నారు.



### చారిత్రక అంశాల్లో మార్పు మంచిది కాదు

ప్రభుత్వం ఆలోచనలు మనవీయ కోణంలో ఉండాలి. అప్పుడే ప్రజల్లో ఆదరణ ఉంటుంది. ప్రస్తుతం ఉన్న అంశాల ప్రాధాన్యం తగ్గించకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. సంస్కృతికి దర్పణం ఆనాటి చిహ్నాలు. వాటిని నేటి తరాలకు పరిచయం చేయడంతోపాటు కొత్త వాటిని అందరి ఆమోదంతో చేర్చి ముందుకెళ్లాల్సిన అవసరం ఉన్నది. సృజనాత్మకంగా ఆలోచిస్తూ.. ప్రజల జీవన విధానంపై కేంద్రీకరణ చేస్తే అభివృద్ధి జరుగుతుంది. చారిత్రక అంశాలు, గేయాల్లో మార్పులు అనేది మంచి ఆలోచన కాదని భావిస్తున్నా. ప్రజల ఆసక్తి మేరకు పరిపాలన చేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలు బాధ్యతగా భావించాలి. అప్పుడే ఉద్యమాలు వృథా కాకుండా ఉంటాయి.

– వేణు సంకోజు, ప్రముఖ సాహితీవేత్త, దాశరథి అవార్డు గ్రహీత, నల్లగొండ